కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం 8లో..

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి 8లో..

చెరువును తోడేస్తున్నారు



చెరువు మట్టిని లారీలో నింపుతున్న ఎక్స్‌కవేటర్

- నిబంధనలు బేఖాతర్, రేయింబవళ్లు మట్టి రవాణా
- అనుమతులకు మించి మట్టి తరలింపు
- ఒకే చోటికి అనుమతి తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలింపు
- జిల్లాలో మళ్లీ మొదలైన అక్రమ మట్టి దందా
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి; పెద్దపల్లి)

జిల్లాలో అక్రమ మట్టి దందా మళ్లీ మొదలైంది. ప్రభుత్వం మారినా కూడా దందాలో మార్పు ఏమీ లేదు. అధికార పార్టీ నాయకుల అండ దండలతో నిబంధనలను తోసి పుచ్చుతూ ఇష్టారాజ్యంగా చెరువును తోడేస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి తరలిస్తున్నా సంబంధిత శాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడ ఎవరు కూడా వాహనాలను ఆపకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. జిల్లాలోని కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలోని పెద్ద చెరువులోని మట్టిని ఇటుకల తయారీ కోసం తీసుక వెళ్లేందుకు పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలో గల ఎన్‌బీసీ ఇటుక బట్టి యజమాని నీటి పారుదల శాఖాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు.

నీటి పారుదల శాఖ డివిజన్ 4 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆ మేరకు చెరువులో ఆ శాఖ సిబ్బందిచే సర్వే చేయించారు. 4000 వేల క్యూబిక్ మీటర్లు (6000 మెట్రిక్ టన్నులు) ఇసుక తరలింపు కోసం అనుమతులు ఇస్తూ లేఖ నంబర్ ఈఈ/ఐడీ నంబర్ 4/ఎంఎన్‌టీ/డీబీ/హెచ్‌బీ/180/ఎం, తేదీ 10-05-2024 రోజున ఈఈ కె బలరామయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం సీనరేజీ, అనుమతులు, డీఎంఎఫ్‌టీ, ఎస్‌ఎంఈటీ, ఇన్‌కం ట్యాక్స్ అన్ని కలుపుకుని మెట్రిక్ టన్నుకు 42 రూపాయల 80 పైసల చొప్పున 6 వేల టన్నుల (4000 క్యూ బిక్ మీటర్లు)కు 2 లక్షల 56 వేల 800 రూపా యలు ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించారు. మట్టి తరలించేం దుకు అనుమతి పొందిన ఎన్‌బీకే ఇటుక బట్టీల యజమాని పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచి చెరువులో నాలుగైదు ప్రొక్లెయిన్లను, లారీలను మోహరించి రేయింబవళ్లు మట్టి తరలిస్తున్నారు. ఒక్కో లారీలో 25 నుంచి 30 టన్నులకు పైగా మట్టి తరలిస్తున్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళుతున్నా కూడా రవాణా శాఖాధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రోజుకు 200 ట్రిప్పుల లారీల మట్టిని ఇటుక బట్టి యజమాని తరలిస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, ప్రభు త్వానికి 4 వేల క్యూబిక్ మీటర్లకు ఫీజు చెల్లించి అంతకు మించి మట్టిని తరలించుకు పోతున్నారని, అయినా కూడా నీటి పారు దల, గనులు, భూగర్భ శాఖ, రవాణా శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే మట్టి రవాణా చేయాల్సి ఉండగా రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నా కూడా ఎవరు పట్టింపు లేకుండా పోయింది. ఒకే వే బిల్లుపై రెండు, మూడు ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారని తెలుస్తోంది. మట్టి తవ్వకాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. అనుమతులు పొందిన ఇటుక బట్టీల యజమానికి కేవలం తన ఇటుక బట్టీలకే గాకుండా కల్వచర్ల, రంగాపూర్‌లో గల ఇతర ఇటుక బట్టీలకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తున్నది. ప్రతి ఏటా ఇటుక బట్టీలకు చెందిన యజమానులు నాయకుల అండదండలతో పాటు, అధికారులు తమ వైపు కన్నెత్తి చూడకుండా చూసుకుంటున్నారు. జిల్లాలో చెరువుల మట్టి బంగారంలా మారింది. ఇందుకు జిల్లాలో పెద్ద ఎత్తున ఇటుక బట్టీలు ఉండడమే కారణం. ప్రతి ఏటా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ స్పందించి మట్టి తరలిం పుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





చెరువులో తవ్వకాలు

నేడు విత్తనాలు ఎరువుల నియంత్రణ చట్టంపై అవగాహన

పెద్దపల్లిటౌన్,మే 16: విత్తనాలు ఎరువుల నియంత్రణ చట్టంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ పోలీస్ శాఖ సంయుక్తంగా విత్తనాలు, ఎరువుల నియంత్రణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాబోయే వానా కాలంలో వ్యవసాయ శాఖ చేపట్టే కార్యక్రమాలు విత్తన ఎరువుల నిల్వలో గురించి చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పోలీస్ శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, ఆధీకృత పురుగు మందులు, ఎరువులు విత్తన డీలర్లు పాల్గొనాలని కోరారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం



వడ్డెపల్లి రాంచందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్, మే16: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను బుధవారం రాత్రి ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో రాంచందర్ దంపతులను యూనియన్ నాయకులు శాలువా కప్పి, పూల మాలలతో సత్కరించారు. ఎన్టీపీసీలో చిరుద్యోగిగా పనిచేస్తూ జాతీయ స్థాయి లో ఉన్నత పదవి చేపట్టిన రాంచందర్ ఎస్సీల సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎన్‌బీసీ(ద్వైపాక్షిక సంఘం) సభ్యుడు ఎస్.మల్లేశం, అదనపు సభ్యుడు ఆర్.ఎన్.గణేశ్, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సెక్రెటరీ కంది శ్రీనివాస్, బూర్ల లక్ష్మీనారాయణ, ఎన్‌కెఎస్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.సాగర్‌రాజు, పి.నరేం దర్, సిహెచ్.సత్యనారాయణరెడ్డి, వి.గిరి, వి.రాములు, ప్రసన్నకుమార్, కొమర య్య, ఎస్.ఎస్.రావు, ఇ.హెచ్.రావు, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకుడు సిహెచ్. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోమాసే శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు



గామాసే శ్రీనివాస్‌తో పెద్దపల్లి బీజేపీ నాయకులు

గోదావరిఖని, మే 16: భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లో గురువారం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధి ప్రజలు సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. గోమాసను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎరబెల్లి రఘునాథ్, రామగుండం అసెంబ్లీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు చల్లా నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదర్శ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ముత్తారం, మే16: మండలంలోని దర్యాపూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని వారు కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల నందు 40 సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. 10వ తరగతిలో జీపీఏ మార్కుల ఆధారంగా కోరుకున్న కోర్సునందు ప్రవేశం లభిస్తుందని వారు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి పాస్ అయిన మెమో, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో కాలేజీలో ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారంతో సమర్పించాలని ఆమె సూచించారు.

స్ట్రాంగ్‌రూం వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగిరి, మే 16: మండలంలోని మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్ట్రాంగ్ రూమ్‌పై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ప్రక్రియ కళాశాలలో జరుగుతుందని పేర్కొన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన పోలైన ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ ఎదుట మూడు అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని ఎవరు లోనికి వచ్చే ఆస్కారం లేదన్నారు. స్ట్రాంగ్ రూమ్ సీసీ కెమెరా నిఘాలో ఉన్నాయని పేర్కొన్నారు. వీటి ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు వేసిన సీల్‌లను పరిశీలించారు. అదే విధంగా జూన్ 4న జరగబోయే కౌంటింగ్‌కి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, కెమెరా మానిటరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంతో భాగస్వామ్యమై డెంగ్యూను నివారిద్దాం

- డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్



ర్యాలీలో పాల్గొన్న వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది

పెద్దపల్లి రూరల్, మే 16: సమాజంతో భాగస్వామ్యమై డెంగ్యూ వ్యాధిని నివారించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండలం రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు డెంగ్యూ వ్యాధిపై అవగాహన పెంపొందించుకొని వ్యాధి నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమాజంతో భాగస్వామ్యమై డెంగ్యూను నివారిద్దాం అనే థీమ్‌తో ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించి, దోమలను నియంత్రించాలని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. డెంగ్యూ కలుగజేసే దోమలు పగటి పూట కుడతాయని,ఈ దోమలు నీరు నిల్వ ఉన్నచోట పెరుగుతాయని తెలిపారు. అనంతరం డెంగ్యూ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. దోమలు కుట్టకుండా సాక్స్ , ఫుల్ హ్యాండ్ దుస్తులు ధరించాలని, ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, మూతలు, పగిలిన కుండలు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకొని, కూలర్లు, నీటి తొట్టెలలో ఉన్న నీటిని వారానికి ఒకసారి తప్పనిసరిగా మార్చడం వలన వాటిలో దోమలు గుడ్లు పెట్టకుండా వాటి సంతతి నివారించడం జరుగుతుందన్నారు. తలుపులు, కిటికీలకు దోమ తెరలను బిగించుకోవాలని అన్నారు. జ్వరంతో పాటు ఒంటి నొప్పులు, కంటి రెప్పల నొప్పి లాంటి లక్షణాలు ఉంటే పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి నందు ఎలిసా టెస్ట్ టి హబ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం అధికారి డా. కె.వి.సుధాకర్ రెడ్డి, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మమత, రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యం.ఎల్.హెచ్.పి.లు ఉమా మహేశ్వర్, టి. రాజేశం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిబిరంలో ఖని కెడెట్ల ప్రతిభ



శిబిరంలో పాల్గొన్న కెడెట్లు

కోల్‌సిటీటౌన్, మే 16: ఇటీవల ఊటీలో జరిగిన ఎన్‌సీసీ ఆలిండియా ట్రెకింగ్ శిబిరంలో గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ కెడెట్లు ప్రతిభ కనపర్చారు. తెలంగాణ 9వ బెటాలియన్ నిజామాబాద్ నుంచి ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, కెడెట్లు రితికశ్రీ, నర్తన, సాధ్వి పలు ప్రదేశాలను సందర్శించడమే కాకుండా రితికశ్రీ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనపర్చి కమాండెంట్ చేతుల మీదుగా పతకాలు అందుకుంది. ట్రెక్కింగ్ శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన పాఠశాల కెడెట్లను, ఫస్ట్ ఆఫీస ర్‌ను ప్రిన్సిపల్ జ్యోత్స్న ఈశ్వరి పాలెపు, ఇన్నమ్మ అభినందించారు.

పారిశుధ్య పనులపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

- డీపీవో ఆశాలత
- చీకురాయిలో పనులు పరిశీలన



చీకురాయిలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

పెద్దపల్లి రూరల్,మే 16: గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత అన్నారు. గురువారం మండలంలోని చీకురాయి గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి సరఫరా చేస్తున్న మంచినీటి ట్యాంకు, మంచినీటి బావి, నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో ఆశాలత మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలని , మొక్క ఎండిపోకుండా నిత్యం నీరు అందించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులను వినియోగించి , వర్మి కంపోస్టు తయారీతో పాటు తడి చెత్త , పొడి చెత్తను వేరు చేయించాలన్నారు. గ్రామాల్లోని ప్రతి వీధి శుభ్రంగా ఉంచాలని , శాని టేషన్ పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. గ్రామాల్లో చేసే ప్రతి పనిని రికార్డు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాధకు సూచించారు. వారి వెంట ఎంపీవో సుదర్శన్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



పుట్ట దంపతులకు కేక్ తినిపిస్తున్న పార్టీ నేతలు

మంథని, మే 16: సమాజంలో అసమానతలకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు స్పష్టం చేశారు. పుట్ట మధు నివాసంలో ఆయన జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. గజమాలతో పుట్ట శైలజ,మధు దంపతులను సన్మానించారు. ఈసందర్భంగా ఈసందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో తాను బహుజన బిడ్డగా ఎమ్మెల్యేగా గెలిచిన 16న ప్రజలకు స్వేచ్ఛ రావడంతో ఈ రోజునే తన పుట్టిన రోజుగా ప్రకటించుకున్నట్లు వెల్లడించారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అంబేద్కర్, జ్యోతిబాపూలే ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బహుజనుల్లో రాజకీయ చైతన్యం తీసుకురావటానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, ఏగోళపు శంకర్‌గౌడ్, బత్తుల సత్యనారాయణ, కాయితి సమ్మయ్య, పుప్పాల తిరుపతి, అడిచర్ల సమ్మయ్య, బండారి శ్రీకాంత్ పెగడ శ్రీనివాస్, మాచీడి సత్యనారాయణ గౌడ్, కారెంగుల సుధాకర్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలి

వేడుకుంటున్న ప్రశాంత్‌నగర్ కాలనీవాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు

గోదావరిఖని, మే 16: గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో గ్రంథాలయానికి కేటాయించిన భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ రెవెన్యూ, పోలీస్ అధికారులను కాలనీవాసులు వేడుకున్నారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రశాంత్‌నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు దూలం పోషం, చీమల తిరుపతి మాట్లాడుతూ 25సంవత్సరాల క్రితం వీర్లపల్లి, వెంకట్రావ్‌పల్లి ఓసీపీ-3 విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోగా తమకు ప్రశాంత్‌నగర్‌లో సింగరేణి ఇండ్ల పట్టాలను ఇచ్చిందని, అప్పుడు సింగరేణితో తాము గ్రామంలో ఎలాంటి వసతులు ఉన్నాయో గుడి, బడి, గ్రంథాలయంతో పాటు చాకలి, మంగళి, గొల్ల, కుర్మలకు అందరికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని చెప్పడంతో ప్రశాంత్ నగర్‌లో ఇచ్చారని, అప్పుడు ఆ స్థలాన్ని ఇప్పించింది ఐఎఫ్‌టీయూ నాయకుడు బాబురావు అని చెప్పారు. ఐఎఫ్‌టీయూ నాయకులు కొంత మిగిలి ఉన్న స్థలంలో యూ రాములు పేరిట గ్రంథాలయం కడుతామని హామీ ఇవ్వడంతో ఆ భూమి అలాగే ఖాళీ ఉందని, దీనిపై ఇటీవల కొంత మంది కబ్జాదారుల కన్ను పడిందని, ఈ విషయంపై ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, కోడిపుంజుల రాజయ్యలను దీనిపై అడిగామని, మేము ఎవరికి ఈ స్థలాన్ని అమ్మలేదని స్పష్టం చేశారని, కానీ అదే కాలనీలో నివాసముండే చిలుముల రవి కుమార్, పట్వారీ పానుగంటి అజయ్ కుమార్‌లు ఈ స్థలాన్ని కబ్జా చేసి తన భార్య పేరు అయిన వనిత పేరుపై పట్టా ఎక్కిం చారని ఆరోపించారు. ఈ స్థలం కాలనీకి చెందింది మీకు ఎలా పట్టా చేస్తారని నిలదీస్తే మాపై కేసులు పెడతామంటూ, పీడీ యాక్టులు నమో దు చేస్తామంటూ పట్వారీ అజయ్ బెదిరింపులకు గురి చేస్తున్నాడని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేశారు. తనకు రాజకీయ పలుకు బడి ఉందని, ఎవరూ ఏం చేయలేరని, ఈ స్థలంలో అప్పట్లో గుడిసె ఉండేదని, అది నాదే అంటూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. 85సర్వేనెంబర్‌లో చిలుముల రవికుమార్, పాను గంటి వనిత పేరుమీద ఇంటి రాగా, ఈ ఇంటి నెంబర్ ఎలా ఇస్తారంటూ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆ నెంబర్లను రద్దు చేశారని, అయినప్పటికీ పట్వారీ అజయ్ తన అంగబలంతో తమపై పోలీస్ కేసులు పెడతామంటున్నారని, అతని నుంచి తమను పోలీసులు కాపాడాలని వేడుకున్నారు. సమావేశంలో బండారి సూర్యనారాయణ, శశికళ, త్రివేణి, గోపాల్, నాగరాజు, కొండ సతీష్, రాజయ్య పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు రైతుల మృతి



శ్రీనివాస్, చంద్రయ్య(ఫైల్)

తంగళ్లపల్లి, మే 16: రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడడంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామం భరత్‌నగర్‌కు చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య(42) పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం సాయంత్రం తన ఇంటి దగ్గరలోనే ఉన్న పోలంలో రైతు చంద్రయ్య పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు గమనించి అసుపత్రికి తరలించాడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమా చారం ఆందించారు.

వేములవాడ టౌన్: వేములవాడలో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి ఓ యువ రైతు మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కంబళ్ల కొమురవ్వ, కంబళ్ల శ్రీనివాస్, కంబళ్ల ఎల్లయ్యలు చింతచెట్టుకు చింతకాయ కొట్టేందుకు వెళ్లారు. భారీ ఈదురుగాలులతో కూడిన వర్షంతో పిడుగు పడింది. దీంతో కంబళ్ల శ్రీనివాస్ (30) మృతి చెందగా రేగుల దేవయ్య, రేగుల శ్రీనివాస్, కొమురవ్వ, ఎల్లయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వేములవాడని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడికి భార్య, రెండు నెలల పసిబిడ్డ ఉన్నట్లు తెలిపారు.



కరీంనగర్‌లో జోరుగా బైక్ రేస్‌లు

- గంజాయి మత్తులో యువకుల ప్రమాదకర విన్యాసాలు
- ర్యాష్ డ్రైవింగ్‌లతో బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రజలు

అర్జున్.. నైట్ డ్యూటీ ముగించుకుని నగర శివారులో ఉండే తన ఇంటికి బైక్‌పై వెళుతున్నాడు. ఇంతలో ఓ బైక్ రయ్‌మని అతడి పక్కనుంచి దూసుకుపోయింది.. భయపడ్డ అతను తేరుకునేలోపై మరో బైక్ పెద్ద శబ్దంతో అంతకంటే వేగంగా వెళ్లింది. అలా నాలుగు బైక్‌లు వెళ్లాయి.. అప్పుడు అర్థం అయ్యింది అతడికి అక్కడ బైక్ రేసింగ్ జరుగుతోందని.. కరీంనగర్ శివార్లలోని రోడ్లపై కొందరు యువకులు అర్ధరాత్రి దాటిన బైక్ రేస్‌లు నిర్వహిస్తున్నారు. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రజలను, వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

కరీంనగర్ క్రైం, మే 16: కరీంనగర్‌లో కొందరు యువకులు రాత్రి సమయాల్లో బైక్ రేస్‌లు నిర్వహిస్తూ నగరంలోని ప్రధాన రోడ్లు, నగర శివారులో బైపాస్ రోడ్లపై బైక్ రే'సలు జరుగుతున్నాయి. యువకుల ప్రమాదకర విన్యాసాలతో వాహనదారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్, పెద్దపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, రేకుర్తి బైపాస్ రోడ్డు, మానేరు బైపాస్‌రోడ్, ఎల్ఎండీ రిజర్వాయర్ కట్టపై, చింతకుంట-మల్కాపూర్ బైపాస్ రోడ్, విద్యానగర్-శాతవాహన యూనివర్సిటీ రోడ్లపై ఇష్టారాజ్యంగా బైక్ రేసులు జరుగుతున్నాయి.

ప్రమాదాలతో భయాందోళనలు

రెండు రోజుల క్రితం భగత్‌సింగ్ చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్‌కు వెళ్లే మార్గంలో బైక్ రేస్‌కు పాల్పడుతున్న యువకుల్లో ఒకరి బైక్ దారిన పోతున్న వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు విరిగి తీవ్ర గాయాలుకాగా యువకులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితుడికి ఒక ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. దీనిపై కరీంనగర్ రెండో ఠాణాలో బాధితులు ఫిర్యాదు చేశారు. రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బైపాస్ రోడ్‌లో రాత్రి సమయంలో కొందరు యువకులు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి సేవిస్తూ నిత్యం బైక్ రేస్‌లు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కొందరు యువకులు రోడ్లపై చేస్తున్న ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్ రైడింగ్, సడన్‌బ్రేక్, ఓవర్‌టేక్, త్రిబుల్ రైడింగ్‌ల వల్ల వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఒకరు చేసిన పొరపాటుతో ప్రమాదాలు జరిగి పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఎటువంటి తప్పిదం లేని పాదచారులు, వాహనదారులు ఎదుటి వాహనదారుల తప్పిదాలతో ప్రమాదాలబారిన పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది.

కొద్ది నెలల కిందట చింతకుంట బైపాస్ రోడ్‌లో బైక్ రేస్‌లో పాల్గొన్న యువకులు బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. అంతకు ముందు కరీంనగర్ కోర్టు చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు బైక్ రేస్ చేస్తున్న రెండు బైక్‌లు అర్ధరాత్రి సమయంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మర ణం చెందారు. మరొక ప్రమాదం లో మానేరు బైపాస్‌రోడ్‌లో ఒక యువకుడు మృతి చెందాడు. ఇలా తరచుగా ప్రమాదాల బారినపడి యువకులు మృత్యువాత పడుతున్నారు. ఖరీదైన బైక్‌లతో యువకులు బైక్ రేస్‌కు పాల్పడుతూ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

బైక్ రేస్‌లలో పాల్గొనే యువకులు ఇటీవల గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొందరు యువకులు రయ్..రయ్..మంటూ ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో నగరంలోని రోడ్లపై ట్రాఫిక్ సిగ్నల్స్‌ను లెక్కచేయకుండా పక్కనున్న వాహనదారుల గుండెల్లో గుబులురేపుతున్నారు. ఇటువంటి వాహనదారులను పట్టుకోవడం ట్రాఫిక్ పోలీసులకు కూడా కష్టంగా మారింది. అతివేగంగా వాహనాలను నడపటం యువతకు ఒక ప్యాషన్‌గా తయారైంది. ఈ అతివేగమే వారి ప్రాణాల మీదికి వస్తున్నది. అతివేగంతో వాహనాలు నడుపుతున్న యువత ఆ వేగాన్ని నియంత్రించే క్రమంలో ఆందోళనకు గురై సడన్‌బ్రేక్‌లు వేయటం, అడ్డదిడ్డంగా వెళ్లటంతో ప్రమాదాలబారినపడుతున్నారు. కరీంనగర్‌లో అర్ధరాత్రి సమయంలో ర్యాష్ డ్రైవింగ్, అధిక శబ్దంతో వాహనాలను నడపడం ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నది. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

ఐనవోలు, మే 16: లారీ ఢీకొని యువ వ్యాపారి మృతి చెందిన సంఘటన పంథిని శివారు లక్ష్మీపురం స్టేజి వద్ద జాతీయ రహదారి(563)పై గురువారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన యువకుడు దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటూ ఒక కంపెనీ (నిత్యావసర సరుకుల విక్రయ) ఏజెన్సీ డీలర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 18 మాసాలుగా ఇల్లందలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ ఆయా మండలాల్లోని గ్రామాల్లో కిరాణం షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట తన మేనత్త మృతిచెందగా ఐదవ రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి అదుపుతప్పి వినియ్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలైయ్యాయి. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ షాపు నిర్వాహకుడికి ఏడాది జైలు శిక్ష

కోరుట్ల, మే 16: పట్టణంలో లైసెన్స్ లేకుండా మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు అమ్ముతున్న వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 50,000 జరిమాన విధించిన ట్లు గురువారం కోరుట్ల కోర్టు న్యాయమూర్తి జిల్లా డ్రగ్స్ ఇన్స్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం 2015లో మందులు నిలువ చేసి అమ్మతున్నా డన్న సమాచారంతో పట్టణంలోని శ్రీరామ క్లీనిక్‌పై దాడి నిర్వహించి పలు రకాల మం దులను జప్తు చేసి చేసినట్లు ఆయన తెలిపారు. క్లీనిక్ నిర్వాహకుడు రామ్మోహన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి అధికారులు హాజరు పరిచినట్లు ఉపేందర్ తెలిపారు. ప్యాసిక్యూషన్ తరపున ప్రభుత్వ న్యాయవాది మాదవి వాదనలను న్యాయమూర్తి పావని ముందు ఉంచగా డ్రగ్స్ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారా లను పరిశీలించిన పిదప డ్రగ్స్ ఆండ్ కాస్మెటిక్ చట్ట నిబంధనలకు విరు ద్ధంగా మందులు నిలువ ఉంచి అమ్మి నట్లు రుజువు కావ డంతో నిందితుడు రామ్మోహన్‌కు ఏడాది జైల్ శిక్ష రూ. 50,000 జరిమానా జూనియర్ సివిల్ న్యాయమూర్తి పావని విధించినట్లు తెలిపారు.

పడిపోయిన విద్యుత్ స్తంభాలు

గణేశ్‌నగర్, మే 16: గాలి దుమారానికి కరీంనగర్ టౌన్ డివిజన్ సిరిసిల్ల సబ్ డివిజన్ నాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. నాంపల్లి సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జె రాజం పరిశీలించారు. నాంపల్లి సబ్‌స్టేషన్ 11కెవి, ట్రిప్పింగ్ విషయమై సెస్ మేనేజింగ్ డైరెక్టర్ 11కెవి మెయింటెనెన్స్, అన్ని విషయాలను వివరించారు. గురువారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం వలన నందికమాన్, మర్లపేట 33 కెవి ఫీడర్ యొక్క ఏడు కరెంటు పోల్స్ గాలి దుమారానికి పడిపోయాయి. వాటిని ఎస్ఈ, డీఈ పరిశీలించి పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 16: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాజన్నపేటలోకి వ్యక్తి రాణవేణి శంకర్, అల్మాస్‌పూర్ గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్ నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్ తన ఆటోలో ప్రయాణీలను ఎక్కించుకుని గొల్లపల్లి నుంచి అల్మాస్‌పూర్ వైపుకు వెళుతున్నాడు. రాజన్నపేటలోని వ్యక్తి రాణవేణి శంకర్ తన బైక్‌పై అటు నుంచి వస్తున్న క్రమంలో ఆటో, బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. కాగా రోడ్డుకిరువైపుల ధాన్యం కుప్పలు ఉండడం వల్ల రెండు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

చెరువు మట్టి..పంట పొలాలకు పుష్టి

- భూసారం పెంచుకునేందుకు రైతుల పోటీ - చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం



చెరువులో మట్టి తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

కథలాపూర్, మే 16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చెరువుల్లో పూడిక తొలగింపు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ప్రస్తుతం పంటలన్నీ చేతికి రావడంతో భూములు పడావుగా ఉన్న నేపథ్యంలో రైతాంగం పోటీ పడీ చెరువు మట్టిని పొలాల్లో వేసుకుం టున్నారు. ప్రతీ రోజూ ఉదయం చెరువుల్లో ట్రాక్టర్ల జాతర కొనసాగు తోంది. రైతులు తమ పంట పొలాల్లో భూసారం పెంచుకు నేందుకు మట్టిని తరలించుకుంటున్నారు. ఉపాధి హామి అధికార యంత్రాంగం మట్టి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మట్టిలో పోషకాల గురించి వివరిస్తున్నారు.

● 8 గ్రామాల్లో..

మండలంలోని కలికోట, కథలాపూర్, పోసానిపేట, గంభీర్‌పూర్, దుంపెట, భూష ణరావుపేట, ఊట్‌పల్లి, దుంపెట గ్రామాల్లోని చెరువుల్లో మట్టి తరలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. సుమారుగా 50 వేల క్యూబిక్ మీటర్ల మేర ఇప్పటికే రైతాంగం తమ చేలల్లో మట్టిని తరలించుకున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి గుట్టల పైభాగం నుంచి చెట్ల ఆకులు వరద ఉధృతికి కొట్టుకు వచ్చి చెరువుల్లో మురి గిపోయాయి. దీంతో మట్టిలో భూసారం పెంచే పోషకాలు అధి కంగా ఉంటాయని అధి కారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రైతులు భారీ సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని మట్టిని పోసుకుంటున్నారు. పంటల దిగుబడి ఆశించిన రీతిలో రావడానికి ఆస్కారం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏళ్ళుగా చెత్తా, చెదారంతో పేరుకుపో యిన చెరువుల్లో మట్టి తొలగింపు కారణంగా లోతు పెరుగుతోంది. ఈ పరిస్థితు ల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పుష్కలంగా పెర గడానికి దోహదం కానుందని రైతులు చెబుతున్నారు.



పొలాల్లో రైతులు వేసుకున్న మట్టి

రైతులు మట్టిని తరలించుకుంటున్నారు..



చెరువు మట్టి వల్ల లాభాలు తెలుసుకున్న రైతులు ఎంతో ఉత్సాహంగా వేకువజామునే ట్రాక్టర్లను లైన్‌లో పెట్టుకుంటున్నారు. ఎండల కారణంగా ఉదయమే పనులు కొనసాగుతున్నందు వల్ల ఉపాధి కూలీలు సైతం అధిక సంఖ్యలో వస్తున్నారు. పోషకాలతో కూడిన మట్టి వల్ల పం టల దిగు బడులు పెరగనున్నాయి. రైతులే స్వచ్ఛం దంగా ముందుకు రావడం శుభపరి ణామం.

- వెగ్యారపు శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



అధికారుల సూచన మేరకు ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతాన్ని పెంచుతున్నాం. ప్రతీ దినం కూలీ సగటున రు. 292లు వచ్చే విధంగా మట్టిని తొలగించేందు ప్రణాళి కలు రూపొందించుకున్నాం. అదేవిధంగా మట్టి వల్ల చేకూరు లాభాలను వివరించడం వల్ల పోటీ పడి తమ చేలల్లో చెరువు మట్టి వేసుకుంటున్నారు. కూలీలకు తాగునీరు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం.

- బొంగు నడ్పి సత్యనారాయణ, సీనియర్ మేట్

ముస్తాబవుతున్న అంజన్న ఆలయం


ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది

- హనుమాన్ జయంతికి అధికారుల ఏర్పాట్లు

మల్యాల, మే 16: పెద్ద హనుమాన్ జయంతి కోసం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి రంగులు వేస్తున్నారు. ఈ నెల 30 నుంచి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. యేటా హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా అంజన్న ప్రధాన ఆలయంతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారి ఉప ఆలయాలకు రంగులు వేస్తుంటారు. దీంతో రెండు రోజులుగా సిబ్బంది రంగులను ఆలయంకు పూసే చర్యలు చేపట్టారు. కాగా ఆలయానికి రంగులు వేసేందుకు రెండు నెలల ముందుగానే ఆలయ అధికారులు టెండర్లు ఆహ్వానిస్తుం టారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి రావడంతో టెండర్లు నిర్వహించలేదు. దీంతో రంగుల వేయడం కోసం దేవస్థానం అధికారులు ప్రత్యామ్నయం కోసం పరిశీలించారు. ఆలయానికి రంగుల పూతకు సుమారు రూ. 2లక్షలు అవసరం కాగా రంగుల పూత కోసం కొండపైన దేవస్థానం ఆధ్వర్యంలో టెండర్ల ద్వారా వివిధ దుకాణాలు నిర్వహించే వ్యాపారులను ఆలయ ఈవో చంద్రశేఖర్ సంప్రదించారు. ఆలయానికి రంగుల కోసం ముందుకు రావాలని కోరారు. దీంతో కొండపైన గల దుకాణదారులు రంగులు వేయించడంకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రెండు రోజులుగా రంగుల పనులు చేపడుతున్నారు.

ధర్మపురిలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ధర్మపురి, మే 16: ధర్మపురి క్షేత్రంలో నాల్గో రోజు గురువారం శ్రీ నృసింహ నవరాత్రోత్సల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్సోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సామవేద పారాయణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల స్థాపిత దేవతా పూజలు, సహస్ర, వరుణ, కళశ స్థాపన పూజలు చేశారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీ నారసింహ, మూల మంత్ర, వరుణ మూల మంత్ర, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివా సాచార్య, రఘునాథాచార్య, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీని వాస్, బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

యునెస్కో సమావేశానికి ఆహ్వానం


కొత్తిరెడ్డి మల్లారెడ్డి

ఓదెల, మే 16: యునెస్కోలో అక్టోబరు 10, 11న నిర్వహించే విద్యాస మావేశానికి ఆహ్వానం అందినట్లు ఓదెల మండలం కొమిరకు చెందిన ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. యూనెస్కో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్‌లో సహకారాన్ని పెంపొందించడం ద్వారా యువత కోసం సమర్థవంతమైన వ్యవస్థాపక విద్య వ్యూహాల రూపకల్పన గురించి ఉజ్బేకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో అక్టోబరు 10,11న విద్యా సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎంపిక చేస్తూ తనకు యునెస్కో నుంచి ఆహ్వానం అందినట్లు మల్లారెడ్డి తెలిపారు. యునెస్కో సమావేశానికి డా.కొత్తిరెడ్డి మాల్లారెడ్డి ఎంపిక కావడం పట్ల ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కల్వకుంట రామకృష్ణ, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె. సురేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ డా.ఎ. శ్రీనివాస్, జిల్లా బాధ్యులు డా.జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్స్ డా.ప్రమోద్‌కుమార్, టి.రాజయ్య అధ్యాపకులు, విద్యా ర్థులు అభినందనలు తెలిపారు.

రూ.7,050 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,050 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 77క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,050, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

27 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్ రూరల్, మే 16: అక్రమంగా తరలిస్తున్న 27క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్ అనే వ్యక్తులు గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని అనంతసాగర్‌లోని కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా 27క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టీఎస్03 యూడీ0406 అనే వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రాంపూర్ గ్రామ శివారులో ఎస్సై సాంబయ్యగౌడ్ సిబ్బందితో పట్టుకున్నారు. పట్టుకున్న పీడీఎస్ బియ్యాన్ని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, మే 16: ప్రమాదవ శాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. గురువారం సుమారు 25 నుంచి 30 ఏళ్ల యువకుడు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని రైలుబండి ఎక్కబోయి లేదా రైలులో ప్రయాణిస్తుండగా రైలు నుంచి కింద పడిపోయినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మృతుని ముఖము నుజ్జు నుజ్జు కావడంతో గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి అడ్రస్ ఆధారాలు లభించలేదని, కుడి చేతిపై కాంతమ్మ అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు, మెరున్ రంగు హాఫ్ టీ షర్ట్ , మెరున్ రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నెంబరు: 9949304574, 871268604లో సంప్ర దించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోరుట్ల, మే 16: పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో నివాసం ఉంటున్న ఇందూరి నర్సింహాచారి (25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... నర్సిం హాచారి కుల వృత్తి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి నర్సింహాచారి సరైన పని లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యు లు గమనించి చికిత్స నిమిత్తం కోరు ట్ల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కొసం కరీంనగర్‌కు తరలించింగా చికిత్స పొందుతూ నర్సింహాచారి గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహాచారి తండ్రి వెంకటరమణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 16: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ .(ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్) 3,1వ సెమిస్టర్ మార్చి 2024 పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఫలితాలను యూనివర్సిటీ వెబసైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి విద్యార్థిని ఎంపిక


ప్రాజెక్టు వివరాలను రాష్ట్రపతికి వివరిస్తున్న విద్యార్థి పూజశ్రీ

పెద్దపల్లి కల్చరల్, మే 16: జిల్లా విద్యార్థిని 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీల్లో సత్తాచాటిన జిల్లా విద్యార్థినికి మరో అరుదైన అవకాశం లభించింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ముస్త్యాల పూజశ్రీ మే 19 నుంచి 25వ తేదీ వరకు జపాన్ రాజధాని టోక్యో వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సకూర కార్యక్రమంలో పాల్గొనాలని ఈ మేరకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి విద్యార్థినికి ఆహ్వానం అందినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. 2022సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలో జరిగిన 9వ జాతీయ ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేతుల మీదుగా పూజశ్రీ అవార్డు అందుకున్నట్లు డీఈవో పేర్కొన్నారు. అలాగే గత ఏడాది ఏప్రిల్ 10న రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన సైన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు. జపాన్ సకూర అంతర్జాతీయ వైజ్ఞానిక కార్యక్రమానికి గత ఏడాది నవంబర్‌లో జిల్లాకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందనాపూర్ పదో తరగతి విద్యార్థిని దాసరి హర్షిత ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా నుంచి విద్యార్థి ఎంపిక కావడం పట్ల పూజశ్రీని అలాగే ప్రోత్సహించిన గైడ్ టీచర్ ను డీఈవో డి.మాధవి, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావులు గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

కళతప్పిన కొత్తపల్లి చెరువు

- అడుగంటిన జలాలతో ఆందోళనలో అన్నదాతలు
- మత్స్యకారులకు ఉపాధి కరువు


నీటిమట్టం తగ్గిన కొత్తపల్లి చెరువు

భగత్‌నగర్, మే 16: ప్రతి ఏటా నిండుకుండలా జలకళ సంతరించుకుని ఉండే కొత్తపల్లి చెరువులో నీరు తగ్గి కళ తప్పింది. ఎండాకాలంలో సైతం మత్తడి దూకిన కొత్తపల్లి చెరువు కళా విహీనంగా తయారైంది. కొత్తపల్లి చెరువు 195 ఎకరాల విస్తీర్ణంలో జల కళతో నిండుకుండలా ఉండాల్సిన చెరువులో నీరు లేక వెలవెలబోతున్నది. వేలాది ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన కొత్తపల్లి చెరువు కళావిహీనంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి చెరువులోకి సమీప మండలాలైన బోయినపల్లి, రామడుగు, గంగాధర మండలాల్లోని 29 చెరువులు, కుంటల నుంచి వరద నీరు చేరిపోతుండేది. కాళేశ్వరం నీరు రాకపోవడంతో వరద నీరు లేక కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు వెలిచాల సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంతో కాలువల ద్వారా నీరు రాకుండా నిలిపి వేయడంతో కొత్తపల్లి చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. కొత్తపల్లి చెరువు నిండి మత్తడి దూకినప్పుడు వరదనీరు కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ వాగులోకి వెళ్తాయి. ఈ ప్రాంతంలోని కొత్తపల్లి చెరువులో నీరు లేక పోవడంతో ఈ ప్రాంతంలో చెరువుపై ఆధారపడి పంటలు పండించే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొత్తపల్లి చెరువు మత్స్యకారులకు సైతం వరప్రదాయినిగా నిలుస్తున్నది. చెరువులో నీరు లేక పోవడంతో చేపలు కూడా లేకుండా పోతున్నాయి. కొత్తపల్లి చెరువు నింపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి జల కళ తీసుకు రావాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు.

● కలగానే మిగిలిన మినీ ట్యాంక్‌బండ్

కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం పూనుకున్నా ఆ దిశగా అడుగులు పడలేదు. దీంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్ చేయాలనే ఉద్దేశం కలగానే మిగిలిపోయింది. నగరానికి సమీపంలో ఉండడంతో కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఎంపిక చేసి పర్యాటకుల సందర్శనకు అనువుగా తీర్చిదిద్దాలనుకున్నారు. కొత్తపల్లి-మల్కాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పుడిపుడే సాగుతున్నాయి. కొత్తపల్లి చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మే,16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదవి పోయాక రైతులపై మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. గురువారం మం డలంలోని లచ్చక్కపేట గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పార్టీకి క్యాడర్ లేదని బీజేపీకి కుదువ పెట్టారని మం డిపడ్డారు. రాష్ట్రంలో సన్న రకం ధాన్యానికి అధిక డిమాండ్ పెరగడంతో సన్న రకం ఉత్ప త్తులను ప్రోత్సహించేందుకు అదనపు రాయితీ కల్పించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆనాడు కేసీఆర్ సన్న రకం సాగు చేయాలని రైతులను మోసం చేసిన సంగతిని గుర్తు చేస్తూ ఫైర్ అ య్యారు. రైతుల సంక్షేమం కోరేది కేవలం కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ప్రభుత్వం పంపిణీ చేయబడుతున్న బియ్యం వినియోగ దారులు ఎక్కడ వినియోగించడం లేదనే ఉద్దేశ్యంతో వినియోగించుకునేలా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కేసీఆర్ వాస్తవాలను గ్రహించకుండా మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్ మూసి వేసిన చక్కెర ఫ్యాక్టరీని పున ప్రారంభిం చేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం లేక పోవడంతో ఇతర జిల్లాలకు తరలించి రెండు వారాల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేల చర్యలు చేపట్టాలని కలెక్టరు, పౌర సరఫరాల కమిషనర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రైతుల రుణమాఫీ రూ, 2లక్షలు ఏక కాలంలో చేసి ఇచ్చిన మాట నిరుపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, బేతి శంకర్‌రెడ్డి, రవి, సుధాకర్, బేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

గొల్లపల్లి, మే 16: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ కుటుంబం పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన గ్రామానికి చెందిన కల్లెం తిరుపతి, కల్లెం తిరుమలేష్ గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య ఓ ప్రహరీ గోడ విషయంలో జరిగిన గొడవల్లో పలువురికి తీవ్ర గాయాలు కాగా, గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసి పోలీస్ పికేటింగ్ ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల పై కర్రలతో దాడి చేసి సమ్మయ్య, పోశయ్య అనే ఇరువురు వ్యక్తుల పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలపై వీధికుక్క దాడి


గాయపడిన బాలుడు

సిరిసిల్ల రూరల్, మే 16 : పసి పిల్లలపై వీధి కుక్క దాడిచేసి గాయపర్చిన సంఘటన గురువారం సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలో 34 వవార్డు బీవైనగర్‌కు చెందిన మమత- వెంకటేశం దంపతుల కుమారుడు నర్సింగోజ్ లిమ్సు అనే మూడేళ్ల బాలుడు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న క్రమంలో వీధి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు కుక్క బారినుంచి బాలుడిని కాపాడి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అదే వార్డుకు చెందిన చౌదరం రాజు, సుమలత దంపతుల కుతురు చౌదరపు అద్య అనే చిన్నారిపై కుక్క దాడి చేసి గాయపడర్చడంతో కుటుంబసభ్యులు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. వార్డులో వీధి కుక్కలు చాలా ఉన్నాయని ఇప్పటివరకు 15 మందిపై దాడులు చేసి గాయపరిచాయని వార్డు కౌన్సిల ర్ తెలిపారు. కుక్కల నివారించాలని మున్సిపల్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వార్డులో చిన్నపిల్లలు రోడ్డుపై ఆడుకోవడానికి రావడానికి భయంతో వణికిపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

తిమ్మాపూర్ (మానకొండూర్), మే 16: మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల మల్లయ్యకు చెందిన ఆవు, దూడ, గురువారం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఆవుదూడ మృతి చెందడంతో రైతు మల్లయ్య కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. వీటి విలువ సుమారు లక్షా 25వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో


కోనరావుపేట ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట, మే 16: ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరగడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోవడంతో కోనరావుపేట మండల కేంద్రంలో రైతులు ధాన్యం బస్తాలతో గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా లేకపోవడంతో అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను లారీల కొరతతో తరలించడం లేద న్నారు. రైతులు ధర్నాకు దిగడంతో వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది కలగడంతో విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై అంజనేయులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని రైతులను ఒప్పించడంతో రాస్తారోకో విరమించారు.

చందుర్తి: ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ఆందోళన చేపట్టి, నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేక, పొలాల వద్ద విక్రయించేందుకు నెల రోజుల నుంచి సిద్ధంగా ఉంచినప్పటికీ, కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే పరిస్థితి ఉందని, వర్షాలు కురిస్తే పొలాల వద్దకు లారీలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల పరశురాములు, సింగిల్ విండో డైరెక్టర్ నాగం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


జోగాపూర్ గ్రామపంచాయతీ ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

గాడిదల పెంపకంపై ఆసక్తి

- సౌందర్య ఉత్పత్తులకు పాల వినియోగం
- లీటరు పాల ధర రూ. 3 నుంచి 5వేలు


చిగురుమామిడిలో గాడిదల కోసం నిర్మించిన షెడ్డు

చిగురుమామిడి, మే 16: మండలంలోని రెండు గ్రామాల్లో గాడిదల ఫామ్‌ల ద్వారా ఉపాధి పొందుతు న్నారు. పెంపకం చేపడుతున్నారు. గరిటడైన చాలు గాడిద పాలు అన్న నానుడిని నిజం చేస్తూ యువకులు ఉపాధి పొందుతూ స్ఫూర్తిగా నిలు స్తున్నారు. మండ లంలోని ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో కొందరు స్నేహితులు కలిసి ఆయా గ్రామాల్లో గాడిదల ఫామ్‌లు ఎర్పాటు చేసి మండలంలోని నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కత్తీయానాడీ, అలరీ అనే బ్రీడ్ గాడిదలను చెన్నై, బెంగుళూరు నుంచి కొనుగోలు చేశారు. ఒక్కొ క్క గాడిద ధర 70 వేల నుంచి 2లక్షల రూపాయల వరకు ఉంటుంది. ప్రస్తుతం అ రెండు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫామ్‌ల్లో 40 పైగ గాడిదలు ఉన్నాయి. వాటిని ప్రతిరోజు గేదెల మాదిరిగానే మేత కోసం తీసుక వెళ్లాలి. ఒక్కొక్క గాడిద అర లీటరు నుంచి లీటరు వరకు పాలు ఇస్తుందని పెంపకందారులు చెబుతున్నారు. పాలను చెన్నై తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. గాడిద పాలను సౌంద ర్య ఉత్పత్తులకు వినియోగిస్తుం డడంతో మంచి డిమాండ్ ఉంది. లీటరు పాల ధర 3 నుంచి 5 వేల రూపాయల వరకు ఉంటుంది. గాడిదల మేత కోసం దశరథి అనే పచ్చి గడ్డిని పెం చుతున్నారు. గడ్డిని మిషన్ ద్వారా కట్ చేసి గాడిదలకు మేతగా వేస్తారు గాడిదల పాలకు ఇతర దేశాల్లో భలే గిరాకి ఉంటున్నం దున, అధిక పెట్టుబ డులు పెట్టి గాడిదల ఫామ్‌లు ఎర్పాటు చేస్తున్నారు. పాలను నిల్వ చేసేందుకు ఫ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. రోజు వారిగా పాలు విక్రయించకుండా కొన్ని లీటర్ల పాలు నిల్వ అయిన తరువాతే సంబంధిత (చెన్నై) వ్యాపారులకు సమాచారం ఇస్తే సిబ్బంది తీసుకెళుతున్నారు.


చిగురుమామిడిలో పెంచుతున్న గాడిదలు

ప్రభుత్వాలు చేయూతనివ్వాలి



గాడిదల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. గాడిదల కొనుగోలుకు అధికంగా పెట్టుబడి అవసరం ఉన్నందున ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తే యువలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. గాడిద పాలను ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటే ధర అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

- వేముల రాము, ఫాం నిర్వాహకుడు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



పెద్దపల్లి దీక్ష శిబిరంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు



గోదావరిఖనిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు


మంథనిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

పెద్దపల్లిటౌన్,మే 16: కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గురువారం స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫ్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుందన్నారు. దుక్కులు దున్నినప్పటి నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వరకు రైతులకు అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ లేదని, సాగుకు సరిపడా విద్యుత్తు అందించడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర లేక అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందన్నారు. రైతు పండించిన వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటన రైతు రుణ మాఫీ చేయాలన్నారు. రైతుల సమస్యలు నేరవేర్చే వరకు వారి పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాసరి ఉష, ఉప్పు రాజ్‌ఉమార్, బాలాజీరావు, పెంచాల శ్రీధర్, ఫహీం, కాశిపాక వాసు వెన్నం రవీందర్, సతీష్‌రెడ్డి తదితరులున్నారు.

గోదావరిఖనిలో..

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక మోసపూరిత విధానాలు నిరసిస్తూ గురువారం స్థానిక అంబేద్కర్‌చౌరస్తా సమీపంలో రాజీవ్ రహదారి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ నాయకత్వంలో ఈ రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి వడ్లకు క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారని, రైతులకు బోనస్ ఇచ్చే ఉద్ధేశ్యం లేకనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని చందర్ చెప్పారు. అయితే రైతులకు ఎలాంటి నష్టం జరిగినా, రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు రూ.500బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను తొలగించారు. ఈ రాస్తారోకోలో పలు గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: వరి పండించిన రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి, పెద్దపల్లి జెడ్పీ ఛైర్మన్ పుట్ట మధు సూచనతో స్థానిక అంబేద్కర్ చౌక్‌తో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు గురువారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు మద్దతు ధరతో పాటు క్వీటాల్‌కు రూ. 500 బోనస్‌గా వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనస్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు బోనస్ ఇవ్వకుంటే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, బత్తుల సత్యనారాయణ, కాయితి సమ్మయ్య, పుప్పాల తిరుపతి, అడిచర్ల సమ్మయ్య, బండారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

జగిత్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర వేతన సవరణ కమిటీ ఛైర్మన్ శివ శంకర్‌కు గురువారం పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. హైద్రాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులతో కలిసి పలువురు జిల్లా పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఉద్యోగుల కనీసం వేతనం రూ. 35 వేలు, గరిష్ట వేతనాలు రూ. 2,99,100లుగా ఉండాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుమతించినందున డీఎస్సీ 2003 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని సొసైటీల పరిధిలోని గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు బాస నర్సింగ్ రావుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

డార్ట్‌బాల్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, మే 16: తెలంగాణ డార్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో జాతీయ స్థాయి ఇండియన్ డార్ట్‌బాల్ ఫెడరేషన్ కప్-2024 పోటీలు ప్రారంభమయ్యాయి. ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ రాష్ట్రాలకు చెందిన జట్లను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. 12 రాష్ట్రాలకు చెందిన 20 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి రోజు జరిగిన బాలుర లీగ్ పోటీల్లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యాన, తెలంగాణ, కేరళ జట్లు గెలవగా, ఒక మ్యాచ్ డ్రా అయింది. బాలికల లీగ్ మ్యాచ్‌లలో గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, హర్యాణ జట్లు గెలిచాయి. ఈ పోటీల్లో అసోసియేషన్ బాధ్యులు అనిల్‌కుమార్, పాశం శ్రీనివాస్, ఓదేలు యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

భోజన్నపేటలో పారిశుధ్య పనులు

పెద్దపల్లి రూరల్, మే 16 : పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. 'నిర్మించినా వినియోగించడం లేదని , బహిరంగ మలవిసర్జనపై చర్యలేవి' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది.స్పందించిన అధికారులు భోజన్నపేట గ్రామంలోని సామూహిక మరుగుదొడ్డిని గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. పారిశుధ్య పనులు చేయించారు.

ప్రమాదకరంగా వాటర్‌ట్యాంక్

● పగుళ్లు చూపిన పిల్లర్స్ ● తొలగించాలని గ్రామస్థుల డిమాండ్

కాల్వశ్రీరాంపూర్, మే 16: మండలంలోని చిన్న రాతి పెల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ ఎప్పుడు కుప్పకూలుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వాటర్ ట్యాంకుతో పాటు కింద పిల్లర్స్ కూడా పగుళ్ల చూపడంతో ప్రమాదకరంగా మారింది. చిన్న రాతిపెల్లి గ్రామంలో మంచి నీటి సౌకర్యం కోసం గత 35 సంవత్సరాల క్రితం పెద్ద రాతుపెల్లి, చిన్న రాతుపెల్లి ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వాటర్ ట్యాంక్ నిర్మించి హుస్సేన్ మియావాగు నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్ ట్యాంక్ నింపి గ్రామానికి నీటి సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మించి ఆ ట్యాంక్ ద్వారా గ్రామస్థులకు ప్రభుత్వం తాగునీరు అందిస్తున్నారు. గతంలో కట్టిన వాటర్ ట్యాంకు శిథిలావస్థలో ఉన్న కారణంగా ఉపయోగంలో లేదు. వాటర్ ట్యాంకు కింది భాగమున ఉన్న నాలుగు పిల్లర్లలో రెండు పిల్లర్లకు పూర్తిగా పగుళ్ల వచ్చాయి. శిథిలావస్థలో ఉన్న ఈ వాటర్ ట్యాంక్ తొలగించాలని గ్రామస్థులు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన రాలేదు. ఈ వాటర్ ట్యాంక్ మెయిన్ రోడ్డు ప్రక్కనే ఉన్న కారణంగా, ఇండ్ల దగ్గరే ఉండడంతో ఎప్పుడు కూలుతుందో, ఏ ప్రమాదం ఉంచుకొస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అప్పుడప్పుడు ఈ వాటర్ ట్యాంక్ పైపెచ్చులూడి కింద పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గేదెలు, ఆవులు వాటర్ ట్యాంకు దగ్గర సేద తీరుతుంటాయి. రెండు పిల్లర్స్ పూర్తిగా పగుళ్లతో ఉండగా మరో రెండు పిల్లరుల పగుళ్ల వస్తున్నాయి. వాటర్ ట్యాంకు కుప్పకూలకముందే ప్రభుత్వం యంత్రాల ద్వారా వాటర్ ట్యాంకులు తొలగించాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వాటర్ ట్యాంక్ ఇళ్ల దగ్గర ఉన్న కారణంగా చుట్టుపక్కల ఇళ్ల పిల్లలు వాటర్ ట్యాంకు వద్ద ఆటలాడుకుంటారు. అంతేకాకుండా ఈ వాటర్ ట్యాంక్ అనుకోకుండా కింద పడితే చుట్టుపక్కల ఇండ్ల మీద పడే పరిస్థితి ఉందని ఆ ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో ప్రమాదకరంగా ఉన్న ఈ వాటర్ ట్యాంక్ తొలగించకుంటే ఎప్పుడే ప్రమాదం ఉంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకులు తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు

ఉపాధి కూలీల ఆందోళన

బీర్‌పూర్,మే 16: పని చేసే ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని కూలీలు గురువారం ఆందోళన చేశారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో సుమారు 300 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. గురువారం పనులు చేస్తున్న కూలీలకు తాగు నీరు ఇవ్వడం లేదని కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఏర్పాటు చేసిన షేడ్ నెట్ గాలీ వానలకు కొట్టుకొని పోగా కనీసం మరొక షేడ్ నెట్ కూడా ఏర్పాటు చేయలేరని మండిపడ్డారు. బీర్‌పూర్ గ్రామంలో కూడా కూలీలకు సరైనా సౌకర్యాలు లేవని, సౌకర్యలు ఏ ర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై ఏపీవో స్వప్నను వివరణ కోరగా కూలీలు పనులు చేస్తున్న సమ యంలో తాగు నీటి సౌకర్యం, ప్రమాదవశత్తు ఏమైనా దెబ్బలు తగిలిన తక్షణ చికిత్స కోసం ఫస్ట్‌అయిడ్ బాక్స్, ఎండలో అలసిపోయిన కూలీలు సేద తీర్చు కోవడానికి(షేడ్‌నెట్) టెంట్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

గణేశ్‌నగర్, మే16: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధి లోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు.మనకొండూర్ మండలంలోని అన్నారం, చెంగర్ల, దేవంపల్లి, రంగపేట, పోచంపల్లి, లలితాపూర్, ముంజంపల్లి, పచ్చునూరు, వేగురుపల్లి, వెల్ది గ్రామాలు, చిగురుమామిడిమండలంలోని చిగురుమామిడి, ఇందుర్తి, ముడిమాణిక్యం, ముల్కనూర్, నవాబుపేట, పీచుపల్లి,సుందరగిరి గ్రామాలు, తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్, మన్నెంపల్లి, పార్లపల్లి, పొలంపల్లి, పోరండ్ల గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రేపటి నుంచి ఎస్సారార్ అటానమస్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 16: కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాల (అటానమస్) డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలో పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఉన్నందున పరీక్షలు కళాశాల ఎదురుగా ఉన్న వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌లో జరగనున్నట్లు విద్యార్థులు గమనించాలని సూచించారు. విద్యార్థులకు ఇప్పటికే హాల్ టికెట్స్ డౌన్ లోడ్ లింక్ పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఏకాగ్రతతో చదువుకొని పరీక్షలు రాయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి

జ్యోతినగర్, మే 16: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ పెట్టాలని రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలను గురువారం ఈడీ కేదార్ రంజన్ ప్రారంభించారు. స్వచ్ఛత విషయంలో సంస్థ ఉద్యోగులు చైతన్యవంతులు కావాలని, తమ ఇంటి పరిసరాలనే కాకుండా తమ పని స్థలాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, అధికారులు, కుటుంబ సభ్యులతో పీటీఎస్‌లో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. స్టేడియం నుంచి టౌన్‌షిప్ వీధుల ద్వారా ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం ఉద్యోగులు, అధికారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈడీతో పాటు అధికారులు, ఉద్యోగులు శ్రమదానం చేశారు. 15 రోజులపాటు స్వచ్ఛతకు సంబంధించి వివిధ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, గుర్తింపు సంఘం నాయకులు ఆరెపల్లి రాజేశ్వర్, వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రమదానం చేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగులు, మహిళలు



కార్మిక వాడలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, మే 16: రామగుండం రీజియన్ పరిధిలోని కార్మిక వాడలకు యాజమాన్యం స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ, ప్రెసిడెంట్లు కుంట ప్రవీణ్, వినయ్, నాయకులు ఉల్లి మొగిలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి నది నుంచి నీటిని ఎలాంటి ఫిల్టరింగ్ చేయకుండా నేరుగా కార్మికవాడలకు యాజమాన్యం సరఫరా చేస్తున్నదని పేర్కొన్నారు. గత నెలలో ఫిల్టర్‌బెడ్‌లను తనిఖీ చేయగా కలుషిత నీటిని సరఫరా చేయడాన్ని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. ఫిల్టర్ చేయకుండా సరఫరా అవుతున్న నీటిని తాగడంతో కార్మిక కుటుంబాలు అనారోగ్యం బారిన పడుతన్నట్టు తెలిపారు. ఇటీవల సీఎండీ బలరాం గోదావరిఖని ఫిల్టర్‌బెడ్‌ని తనిఖీ చేయడంతో ఇక్కడి అధికారులు వారం రోజులు మాత్రమే మంచి నీటిని సరఫరా చేశారని తెలిపారు. సరఫరా అవుతున్న నీరు దుర్వాసనతో పసుపు రంగులో ఉంటున్నదని, అధికారుల నిర్లక్ష ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. వెంటనే శుద్ధమైన నీటిని సరఫరా చేసేలా రామగుండం రీజియన్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీబీజీకేఎస్‌ను అస్థిరపరిచే కుట్రలను తిప్పికొడుతాం

గోదావరిఖని, మే 16: టీబీజీకేఎస్‌ను అస్థిరపరిచే కుట్రలను తిప్పికొడుతామని టీబీజీకేఎస్ నాయకులు వెల్లడించారు. గురువారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, సాంబయ్య తదితరులు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీతో టీబీజకేఎస్‌కు సంబంధం లేదని ప్రకటించే అధికారం, నైతికత మంథని బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు లేదని అన్నారు. ఆరు జిల్లాలు, 11డివిజన్లలో విస్తరించి ఉన్న టీబీజీకేఎస్ నిర్మాణాన్ని, బీఆర్ఎస్‌తో టీబీజీకేఎస్‌కు ఉన్న సంబంధంపై వ్యాఖ్యానించడం కేవలం ఒక ప్రాంతానికి చెందిన పుట్ట మధుకు లేదని వారన్నారు. ఇది బీఆర్ఎస్‌ను నష్టపరిచి టీబీజీకేఎస్‌ను విచ్ఛిన్నం చేసే కుట్రగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్న సందర్భంలో యూనియన్‌లో రాజకీయ జోక్యాన్ని నిలిపివేయించేందుకు గతంలో రాష్ట్ర స్టీరింగ్ కమిటీ తీర్మానం చేసుకున్నదని, ఆ తరువాత యూనియన్ ఎన్నికల్లో అధ్యక్ష కార్యదర్శులుగా మిర్యాల రాజిరెడ్డి, కాపు కృష్ణలను ఎన్నుకున్న తరువాత మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మార్గనిర్దేశనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టీబీజీకేఎస్ ప్రతినిధి బృందం కలిసిన విషయంలో పుట్ట మధుకు తెలియదని వారు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం టీబీజీకేఎస్ పనిచేయాలని కేటీఆర్ ఆదేశించారని, కోల్‌బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం టీబీజీకేఎస్ శ్రేణులు పనిచేయాలని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో యూనియన్ నిర్మాణం కోసం కానీ, బీఆర్ఎస్‌తో టీబీజీకేఎస్ అనుసంధాన విషయంలో కానీ ఎలాంటి అవగాహన లేని పుట్ట మధు తన స్థాయిని మించి ప్రకటన చేయడం అవివేకమని టీబీజీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసంబద్ధంగా కొన్ని విమర్శలు చేసిన పుట్ట మధు అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటమికి కారణాలు ఏమిటో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. తాము అనేక విమర్శలు పుట్ట మధుపై చేయవచ్చునని, పార్టీకి జరిగే నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ పని చేయడం లేదన్నారు. అయితే పుట్ట మధు వ్యవహారాన్ని బీఆర్ఎస్ అధిష్టానం దృష్టి తీసుకెళతామని చెప్పారు. సమావేశంలో సాంబయ్య, సంపత్‌రెడ్డి, చెల్పూరి సతీష్, పాశం శ్రీనివాస్, గండి శ్రీనివాస్, చిలుకపల్లి శ్రీనివాస్, జనగామ మల్లేష్, కొండ్ర అంజయ్యగౌడ్, రమేష్, లక్ష్మణ్, అభిషేక్, ఆరీఫ్, తిరుపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనకు పూజశ్రీ ఎంపిక

● జపాన్ పర్యటనకు అల్ఫోర్స్ విద్యార్థిని


పూజశ్రీని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, మే 16: సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌కు చెందిన పూజశ్రీ అనే విద్యార్థిని జపాన్ దేశంలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అర్హత సంపాదించింది. అల్ఫోర్స్‌లో ఇటీవల పదవ తరగతి పరీక్ష ఉత్తీర్ణురాలైన ఎం పూజశ్రీ అనే విద్యార్థిని ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనలలో పాల్గొని వీల్ ఆక్సిల్ కెమెరా అనే ప్రదర్శనను అద్భుతంగా ప్రదిర్శించడంతో నిర్వాహకులు, సందర్శకులను, అధికారులను ఎంతగానో ఆకట్టుకుంది. దాంతో పూజశ్రీ ఎగ్జిబిట్‌ను అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 19 నుంచి 25 వరకు జపాన్ దేశంలోని సకురాలో జరుగనున్న అంతర్జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలకు పూజశ్రీ వెళ్లనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూజశ్రీని అల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా మన దేశానికి రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని కోరారు. జపాన్ పోటీలకు ఎంపికైన పూజశ్రీని డీఈఓ మాదవి, డిఎస్ఓ రవి నందన్, ప్రిన్సిపాల్, ఆద్యాపకులు తదితరులు అభినందించారు.

అనారోగ్యంతో కేశోరాం ఛైర్మన్ మంజుశ్రీ మృతి

పాలకుర్తి, మే 16: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీ వ్యవస్థాపకుడు బసంత్ కుమార్ బిర్లా కూతురు, ప్రస్తుత కేశోరాం కంపెనీ ఛైర్మన్ మంజుశ్రీ అనారోగ్యంతో గురువారం కలకత్తాలో మృతి చెందినట్లు ఇక్కడి కర్మాగారం అధికార వర్గం తెలిపింది. ఈ ప్రాంతంలో కంపెనీ నిర్మించి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన మంజుశ్రీ అకాల మరణం ఈ ప్రాంత వాసులకు తీరని లోటని పలువురు కంపెనీ అధికారులు, కార్మికులు తెలిపారు.

వ్యవసాయ బావికి ముళ్ల కంచె ఏర్పాటు

పెద్దపల్లి రూరల్, మే 16 : పెద్దపల్లి మండలం కాపులపల్లిలో ప్రధాన రహదారికి ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి చుట్టూ అధికారులు ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉందని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ బావి చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకముందే బావి చుట్టూ పోల్స్ ఏర్పాటు చేయిస్తామని ఎంపీవో సుదర్శన్ తెలిపారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు ఏర్పాటు చేయడం పట్ల ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నోట్‌బుక్స్ అందజేత


నోట్‌బుక్స్ అందజేస్తున్న భరోస సంస్థ అధ్యక్షురాలు నసీమాబేగం

కోల్‌సిటీటౌన్, మే16: గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని సహస్రకు ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు, భరోస సంస్థ అధ్యక్షురాలు నసీమాబేగం అండగా నిలిచింది. తల్లిదండ్రులు లేని సహస్రకు నోట్‌బుక్స్, పెన్నులను గురువారం భరోస సంస్థ అధ్యక్షురాలు నసీమాబేగం, నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ చేతుల మీదుగా అందజేశారు. దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల మౌనిక, నందిని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సేవే లక్ష్యం'

మంథని, మే 16: మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో మంథని మున్సిపల్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సేవలో తరిస్తామని ఛైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి అన్నారు. పెండ్రి రమ-సురేష్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం కేక్ కట్ చేయించి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఇనుముల సతీష్, శ్రీపతి బానయ్య, గుండా పాపారావు, వీకే రవి, చొప్పకట్ల హనుమంతు, పనకంటి శ్రీధర్, చొప్పకట్ల శ్రీకాంత్, కొట్టే రమేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ కొలుపు


బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

మంథనిరూరల్, మే 16: మండలంలోని గాజులపల్లి గ్రామంలో గురువారం శ్రీపోచమ్మ కొలుపును గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు శ్రీపోచమ్మ గుడి వద్ద కొలుపు కొలిచారు. గ్రామస్థులంతా బోనాలతో గుడి వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు.

పెద్దపల్లి మండలంలో వర్షం

పెద్దపల్లి రూరల్, మే 16: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం స్వల్ప వర్షం కురిసింది. గ్రామాల్లో ఏర్పాటు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చిన ధాన్యం వరిధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి రక్షించుకునే పనిలో పడ్డారు. వాతావరణంలో మార్పులు వస్తున్న దృష్ట్యా ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక విభాగం


ట్రాన్స్‌జెండర్ల ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ దయాల్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మే16: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారు తమ సమస్యలను ఇక్కడ చెప్పుకుంటే పరిష్కరించబడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు అరుణ, అప్పారావు పాల్గొన్నారు.